





» కబ్జాలో నగరంలోని పలు చెరువులు
» ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తున్న ప్రజలు
» రామర్తి చెరువును కాపాడాలంటున్న గ్రామస్థులు
» కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు సిద్ధమవుతున్న జనం
» నగరంలో కబ్జాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్

కబ్జాలపై చర్యకు

సర్కారుపై ఒత్తిడి!

• చెరువు భూముల్లో అక్రమ కట్టడాలు

నిజామాబాద్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రరాజధానిలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ ప్రొటెక్షన్ మానిటరింగ్ ఏజెన్సీ (హైడ్రా) హడలెత్తిస్తోంది. చెరువులు, కుంటల శిఖం, ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను హైడ్రా కుల్చివేస్తుండడంతో ప్రజల నుంచి సర్కారు మద్దతు లభిస్తోంది. హైడ్రా తరహాలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసి చెరువుల్లోని కబ్జాలను తొలగించి అక్రమార్కుల భరతం పట్టాలని ప్రజల నుంచి సర్కారుపై ఒత్తిడి పెరుగుతోంది. నిజామాబాద్ నగరంలో చెరువుల కబ్జాపై వరుసగా వస్తున్న 'ఆంధ్రజ్యోతి' కథనాలపై అధికారులు ఓవైపు వివరాలను సేకరిస్తుండగా అదే సమయంలో నగర ప్రజలు చెరువుల్లోని కబ్జాలను తొలగించాలని ఫిర్యాదులు చేస్తూ ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నగర పరిధిలో గత కొన్నేళ్లుగా చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయి. పలు చెరువుల పరిధిలోని భూముల్లో భారీ నిర్మాణాలు వెలిశాయి. కొన్నిచెరువుల పరిధిలో ఎలాంటి అనుమతులూ లేకుండా ఇళ్ల నిర్మాణాలను చేశారు. ఈ చెరువులు గతంలో 50 ఎకరాల నుంచి 200ఎకరాల వరకు సాగునీరు అందించగా ప్రస్తుతం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. నగరం పరిధిలోని అర్సపల్లిలో ఉన్న రామర్తి చెరువు భూములను కాపాడాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు అధికారులను కోరుతున్నారు. హైడ్రాతరహాలో చెరువుల భూముల్లోని కబ్జాలను తొలంచాలని, ఇందుకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలంటూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అర్సపల్లి పరిధిలోని రామర్తి చెరువు గతంలో 30 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రకటించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం చెరువును పరిశీలించారు. చెరువును రక్షించుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కబ్జాలు చేయడంతో చెరువు విస్తీర్ణం ప్రస్తుతం 12 ఎకరాలకే పరిమితమైందని ఆరోపిస్తున్నారు. బోధన్ రోడ్డువెంట ఉన్న చెరువులోని అక్రమాలన్నీ తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. చెరువు కట్ట బఫర్ జోన్‌లో కూడా పలు నిర్మాణాలు వెలిశాయని ఆరోపిస్తున్నారు. కబ్జాలోని నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్‌ను కలిసేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్తున్నారు. చలో కలెక్టరేట్ ప్రకటిస్తామని, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అక్రమాలపై ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు.

ఆనవాళ్లు కోల్పోతున్న చెరువులు

నిజామాబాద్ నగరం పరిధిలో బొందం చెరువులో ఉన్న అక్రమ కట్టడాలను వెలికితీసినట్టే ఇతర చెరువుల్లో కబ్జాకు గురైన భూములను వెలికితీయాలని ప్రజలు డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ నగరం పరిధిలో గతంలో 20 వరకు చెరువులు, కుంటలు ఉండేవి. వీటి పరిధిలో వ్యవసాయాన్ని కూడా నిర్వహించేవారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న ఈ చెరువులను అధికారులు పట్టించుకోకపోవడంతో గత 20 ఏళ్లలో కబ్జాలకు గురయ్యాయి. దీంవతో పలు చెరువులు ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. నిజామాబాద్ నగరం పరిధిలో ఈ చెరువులకు సంబంధించి సుమారు 100ఎకరాల వరకు భూములు కబ్జాలకు గురైనట్లు ఆ శాఖకు చెందిన అధికారులు గతంలోనే ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది. ఈ చెరువుల పరిధిలో చిన్న కట్టడాలు ఉండగా మరికొన్నింటిలో భారీ నిర్మాణాలు వెలిశాయి. చెరువు శిఖం భూములతోపాటు చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేశారని ఆరోపణలు గత కొన్నేళ్లుగా వినిపిస్తున్నాయి. వీటి పరిధిలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి హైదరాబాద్‌లో హైడ్రా నిర్వహిస్తున్న విధంగా గూగుల్ మ్యాప్ సహాయంతో వివరాలను పరిశీలిస్తే అన్ని బయటకు వస్తాయని పలు సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. పేదలు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే కూలగొట్టే అధికారులు చెరువులు కబ్జాకు గురైతే మాత్రం పట్టించుకోవడం లేదని వామపక్ష సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయిలో కలెక్టర్ జోక్యం చేసుకొని మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులతో సర్వే నిర్వహించి భూములను స్వాధీనం చేసుకోవాలని కొన్ని సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కబ్జాకోర్లపై చర్యలు చేపట్టండి

బొందం చెరువు కబ్జాలకు పాల్పడిన వారిపై ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదని, కబ్జాలకు పాల్పడి అమ్మకాలు చేసిన ప్రజా ప్రతినిధులపై చర్యలు చేపట్టలేదని పలు సంఘాల నేతలు జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. చెరువు ఆక్రమించి ప్లాట్లుగా చేసి పేదలకు అమ్మినవారిపై కేసులు నమోదు చేయడంతోపాటు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్‌కు పలు సంఘాల నేతలు ఫిర్యాదులుచేశారు. బొందంగడ్డ చెరువును కబ్జాకు చేసిన వారికి అధికార, ప్రతిపక్షపార్టీల నేతల అండదండలు ఉండటంతో చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం హైడ్రా తరహాలో జిల్లాలో ప్రత్యేక సంస్థను ఏర్పాటుచేస్తే భూకబ్జాలు ఆగిపోతాయని, కబ్జాలో ఉన్న చెరువుల భూములను కాపాడొచ్చని పలు సంఘాల నేతలు కోరుతున్నారు.



• కబ్జాకు గురవుతున్న చెరువు

మెరుగైన వైద్యం అందించండి

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు • ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ • రోగులకు ఇస్తున్న పరీక్షల రిపోర్టుల పరిశీలన
• రోగులకు అవసరమైన మందులు, ప్లాస్మా, ప్లేట్‌లెట్ యూనిట్స్ ఉన్నాయా..!? అని ఆరా

పెద్దబజార్, ఆగస్టు 27: ప్రస్తుత సీజనల్ వ్యాధుల బారిన పడి ఆసుపత్రులకు వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వైద్య అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఔట్ పేషెంట్, ఇన్‌పేషెంట్ విభాగాలను, ఫీవర్‌వార్డ్, ఆపరేషన్ థియేటర్, శస్త్రచికిత్స వార్డు, రక్తనిధి కేంద్రం, సెంట్రల్‌ల్యాబ్, ఎలిసాటెస్ట్ సెంటర్, టీ-హబ్ సెంటర్‌లను సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. ప్రతీరోజు సగటున ఎంతమంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు.. వారిలో ఎంత మంది ఇన్‌పేషెంట్‌లుగా అడ్మిట్ అవుతున్నారు.. డెంగ్యూ, మలేరియా వంటి వాటితో ఎంతమంది ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు.. తదితర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరిపడా మందులను ప్లాస్మా, ప్లేట్‌లెట్, యూనిట్స్ అందుబాటులో ఉన్నాయా.. అని ఆరా తీశారు. ఆయా విభాగాల వారిగా అందిస్తున్న వైద్య సేవల పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఫీవర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి వాకబు చేశారు. బ్లడ్ సాంపిల్స్ సేకరించి వాటిని పరీక్షించిన అనంతరం రోగులకు అందిస్తున్న రిపోర్టులు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఓపీ రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడమే కాకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై వారికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామఅన్నారు. ముఖ్యంగా జ్వరాలతో ఆసుపత్రులకు వచ్చే ప్రతీ ఒక్కరికి రక్తనమూనాల సేకరణ, ఇతర వైద్యపరీక్షలు నిర్వహించి డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, డయేరియా లాంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా మెరుగైన వైద్య సేవలు అందించేలా పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధుల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటలపాటు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జీజీహెచ్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సీలు, సీహెచ్‌సీలు ప్రత్యేకంగా ఫీవర్ వార్డులను నెలకొల్పి సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ సీజనల్ వ్యాధులకు సంబంధించిన రోగుల వివరాలను కూడా రోజువారిగా తెప్పించుకొని వారికి అందిస్తున్న వైద్య సేవలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులచే నిశితంగా పర్యవేక్షణ జరిపిస్తున్నామని కలెక్టర్ వివరించారు. అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలకు నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయాలని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఆసుప్రతిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్

ఎమ్మెల్సీ కవితకు బెయిల్..
బీఆర్ఎస్ సంబరాలు

సుభాష్‌నగర్, ఆగస్టు 27: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సుప్రీంకోర్టు కవితకు బెయిల్ ఇవ్వడంపై బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. గత ఆరు నెలలుగా ఎమ్మెల్సీ కవిత తిహార్ జైల్‌లో ఉన్నారు. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంచుకొని, పటాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు రోడ్లపైకి వచ్చి సంబరాలు నిర్వహించారు. నగరంలోని కవిత ఇంటి వద్ద జాగృతి, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకొని టపాసులు పేల్చి తమ ఆనందాన్ని ఒకరినొకరు పంచుకున్నారు. అనంతరం నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద నగర అధ్యక్షుడు సిర్పరాజు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. భారీ ఎత్తున టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీఛైర్మన్ దాదన్నగారి విఠల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత ఏతప్పూ చేయలేదని, రాజకీయ కక్ష సాధింపుతోనే జైలుకు పంపారని అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు బీఆర్ఎస్‌ను ఎదుర్కొనలేక ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో సుజిత్‌సింగ్ ఠాకూర్, ఎనుగందుల మురళి, సత్యప్రకాశ్, భరత్ ద్వాజ్, చింత మహేష్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

గంజాయి విక్రయాలపై సీరియస్‌గా ఉన్నాం..

• చంద్రబాన్‌నాయక్, ఇన్‌చార్జి ఈఎస్



గంజాయి అమ్మకాలపై సీరియస్‌గా ఉన్నాం. నిఘాపెట్టి అరెస్టులు చేస్తున్నాం. రైల్వేమార్గం ద్వారా గంజాయి జిల్లాకు చేరుకుంటోంది. రైల్వే పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎస్‌హెచ్‌వోలతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ టీమ్‌లతో నిఘాపెట్టాం.

గంజాయి రహిత జిల్లాగా మార్చాలి

• సురేష్, నందిపేట్



గంజాయి పల్లెపల్లెకూ వ్యాపించింది. గంజాయి మత్తులో యువత వివాదాలకు దిగుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయిని అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయాలి.

• జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు • విద్యార్థులే టార్గెట్‌గా అమ్మకాలు
• రైల్వేస్టేషన్‌లే అడ్డాలు • తనిఖీలు చేస్తున్నా ఆగని దందా
• సూత్రదారులను పట్టుకోవడం విఫలమైవుతున్న పోలీసుశాఖ

గుప్పుమంటున్న గంజాయి!

సుభాష్‌నగర్, ఆగస్టు 27: జిల్లాలో గంజాయి దందా విచ్చలవిడిగా సాగుతోంది. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీసులు అధికారులు చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నా ఈమత్తు దందా ఆగడం లేదు. పెద్దమొత్తంగా గంజాయి అక్రమ రవాణా అవుతున్నా గత కొన్నినెలలుగా అధికారులు పట్టుకున్న గంజాయి 100 గ్రాముల నుంచి 600 గ్రాములే ఉండడం ఏంటని సర్వతా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఎంత ప్రయత్నించినా అక్రమరవాణాదారులు తమ తెలివిని ప్రదర్శిస్తూ పోలీసులను బోల్తా కొట్టిస్తున్నారు. తమ వ్యాపారాన్ని ముడు పువ్వులు ఆరుకాయలుగా సాగిస్తున్నారు. గంజాయి అక్రమ డంప్‌లను ఎక్సైజ్, పోలీసు అధికారులు గుర్తిస్తే దీనికి ఫుల్‌స్టాప్ పడే అవకాశం ఉంది.

• యువతే టార్గెట్

జిల్లాకేంద్రంలో ఇటీవల దొరికిన గంజాయి అమ్మకాల్లో ప్రధానంగా యువత దగ్గరనే గంజాయి దొరికింది. చిన్న చిన్న ప్యాకెట్‌లుగా చేసి గంజాయిని సరఫరా చేస్తున్నారు. నగరంతో పాటు శివారు గ్రామాల్లో సైతం గంజాయి అమ్మకాలు సాగుతున్నాయి. మోటార్ సైకిళ్ల ద్వారా యువతకు గంజాయిని సరఫరా చేస్తున్నారు. పాన్ డబ్బాలు, చిన్న చిన్న హోటళ్లు, దుకాణాలను అడ్డాలుగా చేసుకొని ప్యాకెట్ల రూపంలో గంజాయిని అమ్ముతున్నారు. ప్యాకెట్‌ను బట్టి రూ.100 నుంచి 500 వరకు గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. ఎండు గంజాయిని సిగరేట్‌లో పెట్టుకొని యువత మత్తును ఆ స్వాదిస్తున్నారు. వీరితోపాటు కూలీలు ఎక్కువమత్తు కోసం గంజాయి సేవిస్తున్నారు.

• గంజాయికి అడ్డాగా రైల్వే స్టేషన్లు

నిజామాబాద్‌లోని రైల్వేస్టేషన్లు గంజాయి అడ్డాగా మారాయి. ముఖ్యంగా జిల్లాకేంద్రానికి చెందిన ప్రధాన రైల్వేస్టేషన్‌తో పాటు నవీపేట్ రైల్వేస్టేషన్‌లో గంజాయి యథేచ్ఛగా దొరుకుతోంది. ఇటీవల నవీపేట్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో మూడుకు పైగా గంజాయి అమ్ముతున్న వారిపై కేసులు నమోదు అయ్యాయి. వీరంతా రైల్వే స్టేషన్ ప్రాంతంలోనే అమ్మకాలు సాగిస్తున్నారు. మంగళవారం రైల్వేస్టేషన్ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న వారిని అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని నాందేడ్ మీదుగా నిజామాబాద్‌కు అక్రమంగా గంజాయి చేరుకుంటుంది. నాందేడ్ నుంచి రైలు ద్వారా ప్రయాణం చేసి గంజాయిని జిల్లాలోకి చేరుస్తున్నారు. రైల్వే పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించిన పెద్ద మొత్తంలో గంజాయి లభించకపోవడం గమనార్హం.

• అసలు సూత్రదారులేరి?

గంజాయిని జిల్లాలోకి చేరవేస్తున్న అసలు సూత్రదారులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకోవడంలో విఫలమవుతున్నారు. కేవలం గంజాయిని సేవిస్తున్న వారిని పట్టుకొని కేసులు పెడుతున్నారు. అసలు సూత్రదారులపై చర్యలు లేకపోవడంతో జిల్లాలో గంజాయి దందా సరఫరా సాఫీగా సాగుతోంది. రైల్వేమార్గం ద్వారా ఎవరు చేరవేస్తున్నారనేది వారిపై దృష్టిపెట్టి వారిని పట్టుకోవడంలో ఎక్సైజ్, పోలీసులు శ్రద్ధచూపిస్తే గంజాయి అక్రమరవాణాను సగం వరకు అడ్డుకున్నట్లే. గంజాయి అక్రమ రవాణా సూత్రదారులు కొద్దిమొత్తంలోనే ప్యాకెట్ల రూపంలో గంజాయిని ఏజెంట్లను నియమించుకొని విక్రయిస్తుండటంతో తప్పించుకుపోతున్నారు. చిన్న చిన్న ప్యాకెట్లు అమ్ముతున్న వారిపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. వీరికి ఎలా వచ్చాయి అనేది లోతుగా విచారణ చేసి అసలు సూత్రదారులను అరెస్టు చేయాలి.

• గంజాయి తాగుతున్న ఇద్దరి అరెస్టు

గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 450గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ తెలిపారు. నగరంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఎండుగంజాయిని తాగుతూ అమ్ముతుండగా పట్టుకొని వారివద్ద నుంచి 450 గ్రాముల ఎండుగంజాయి, 2మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు డిగ్రీ పూర్తి చేసి డబ్బుల కోసం ఎండు గంజాయి అమ్ముతున్నట్లు గుర్తించారు. అనంతరం నవీపేట రైల్వేస్టేషన్‌వద్ద తనిఖీలు నిర్వహించగా గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్టుచేసి వారివద్ద నుంచి 250గ్రాముల ఎండు గంజాయి, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, ఎస్సై నర్సింహాచారి, తదితరులున్నారు.

పోచంపాడ్‌లో జల విద్యుత్ ఉద్యోగుల నిరసన



విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మెండోర, ఆగస్టు27: రాష్ట్ర జెన్‌కోలో ట్రాన్స్‌కో తక్షణమే ప్రమోషన్‌ల ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర పీఈఏ నాయకుడు సతీష్, రాష్ట్ర ఈఏఈఏ నాయకుడు భరత్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోచంపాడ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ప్రమోషన్‌ల ప్రక్రియ చేపట్టాలని విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపి జెన్‌కో ఎస్ఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రామగుండంలో జెన్‌కో ఆధ్వర్యంలోనే నూతన పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు శ్రీనివాస్, నితిన్, శ్రీకాంత్, బాలేష్, శృతిమ, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని ధర్నా

మాచారెడ్డి, ఆగస్టు 27: మాచారెడ్డి మండలం నడిమితండా గ్రామానికి సంబంధించిన పోడు రైతులతో కలిసి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ అక్రమ కేసులు ఎత్తివేయాలని పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని రైతుల పంటలను నష్టం చేసిన ఫారెస్ట్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని అన్నారు. ఒకపక్క తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి పట్టాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికి ఫారెస్ట్ అధికారులు అక్రమ కేసులు బనాయించి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. నడిమి తండాకు సంబంధించి భూక్య నసహరి,భూక్యమాన్సింగ్, భూక్యరవిలపై అక్రమకేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అన్ని రాజకీయ పార్టీల నాయకులు గిరిజనుల ఓట్ల కోసం హామీ లిచ్చి గద్దలెక్కిన తర్వాత వారి సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా నాయకులు లిమ్యానాయక్, నరహరి,మాన్సింగ్,మాలోత్ రాజు, భూక్యబంగ్యా, భూక్యదరి, భూక్యరవి,భూక్యవసరం, భూక్య చందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు, కార్మికసంఘం ప్రతినిధులు

డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం ఆందోళన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

భిక్కనూరు, ఆగస్టు 27: తమ పేర్లు వచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వెళ్లకుండా ఇంకెన్ని రోజులు అడ్డుకుంటారని లబ్ధిదారులు భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై సాయికుమార్‌ను ప్రశ్నించారు.గత ప్రభుత్వ హయాంలో భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ శివారు హనుమాన్ ఆలయ సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి గత సోమవారం సాయంత్రం తాళాలను పగులగొట్టి మండలంలోని బస్వాపూర్, సిద్ధరామేశ్వరనగర్ గ్రామాలకు చెందిన గతంలో గుర్తించిన లబ్ధిదారులులోనికి ప్రవేశించారు. మంగళ వారం ఉదయం వీటిలో వారు పాలు పొంగించుకుని కార్యక్రమాలు చేస్తుండగా సమాచారం అందుకున్న భిక్కనూరు తహసీల్దార్, ఎస్సై అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దీంతో తహసీల్దార్, ఎస్సైతో వాగ్వివాదానికి దిగారు. తమకు నిలువ నీడ లేదని, తమ పేరపై డబుల్ బెడ్‌రూం ఇళ్లు వచ్చినా ఎందుకు లోనికి వెళ్లనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కిరాయి కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తాము ఇక్కడి నుంచి వెళ్లమని భీష్మించుకు కూర్చున్నారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేంత వరకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని, ఒకవేళ ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం డబుల్‌బెడ్ రూం ఇళ్లకు తాళాలు వేశారు. కాగా గతంలో సైతం ఇదేవిధంగా తాళాలు పగులగొట్టిలోనికి ప్రవేశించగా రెవెన్యూ అధికారులు వారిని బయటకు పంపి డబుల్ బెడ్ రూం ఇళ్లకు తాళాలు వేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదల భూములను కాపాడాలి

గాంధారి, ఆగస్టు 27: పేదల దళితుల భూములను ప్రభుత్వమే కాపాడి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోతిరాంనాయక్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాములు స్వాహా చేసుకుంటుంటే రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, రాములు, సంఘవ, స్వప్న, సాయవ్వ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం అందించాలి

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి


ప్రభుత్వ ఆసుపత్రిలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు27: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైనా వైద్యం అందించి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై భరోసా కల్పించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అన్ని వార్డులు తిరుగుతూ ల్యాబ్, కిచెన్, బెడ్స్, ఇతర వసతులను ఆయన పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని, గర్భిణులకు ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేయాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వం సరఫరా చేసే మందులతో పాటు అవి లేని పక్షంలో జనరిక్ మందులు రాయాలని సూచించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని చిన్నారులకు సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్యులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి సూచించగా ఆసుపత్రిలో అవసరమైన వాటి వివరాలు తమకు అందజేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్, వైద్యులు ఉన్నారు.

● సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండలంలోని గోవింద్‌పేట్,చేపూర్, సుర్బిర్యాల్, మగ్గిడి గ్రామాల్లో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా గోవింద్ పేట్‌ను ఉత్తమ గ్రామపంచాయతీగా పురస్కారం పొందడానికి కృషి చేసిన పంచాయతీకార్య దర్శిని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, మాజీఎంపీటీసీ రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ మహిపాల్, నవీన్ పాల్గొన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం


నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

నవీపేట,ఆగస్టు27: నిజామాబాద్, నవీపేట రైల్వే స్టేషన్‌ల సమీపంలో ఎండు గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేష్ తెలిపారు. నాందేడ్ నుంచి నిజామాబాద్, నవీపేటకు ఎండు గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నందున రెండు కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్‌లో ఇద్దరు నిందితులను పట్టుకోగా ఒకరు పరారీ అయ్యారని అదుపులోకి తీసుకున్న వారి వద్ద నుంచి 450గ్రాముల ఎండు గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకోగా నవీపేటలో ఎండు గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి మరో 250గ్రాముల ఎండు గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహచారి, సిబ్బంది నారాయణ రెడ్డి, విష్ణు, అవినాష్, భోజన్న, మంజుల తదితరులున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

బోధన్‌రూరల్,ఆగస్టు27: బోధన్ పట్టణంలోని గోశాల ప్రాంతానికి చెందిన అబ్రార్(16)అనే యువకుడు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. అందరితో కలిసి మెలిసి ఉల్లాసంగా ఉండే యువకుడు తెల్లవారు ప్రాంతంలో గుండెనొప్పి రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారని కాలనీవాసులు తెలిపారు. అందరితో కలిసిమెలిసి ఉండే అబ్రార్ గుండెపోటుతో మృతి చెందడంతో కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి.

కాంగ్రెస్ పార్టీలోకి గంగాధర్ గౌడ్

బోధన్‌రూరల్,ఆగస్టు27: బోధన్ పట్టణానికి చెందిన అబ్బగోని గంగాధర్‌గౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరారని ఆయన అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీయూ పీజీ రెగ్యులర్,బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి,ఆగస్టు 27:తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎమ్మెస్ డబ్ల్యూ, ఎంబీఏ, ఎంసీఏ, 2వ సెమిస్టర్ మరియు, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ, 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, పరీక్షలు మెయిన్ క్యాంపస్‌తో పాటు సౌత్ క్యాంపస్,గిరిరాజ్ కళాశాల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, బాన్సువాడ గవర్నమెంట్ కళాశాల, ఆర్మూర్ గవర్నమెంట్ కళాశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి.ఉదయం జరిగిన పరీక్షలకు మొత్తం 1808 విద్యార్థులకు గాను 1687 మంది హాజరయ్యారని, 121 విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. మెయిన్ క్యాంపస్ పరీక్ష కేంద్రాన్ని రిజిస్ట్రార్ యాదగిరి తనిఖీ చేశారని పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగలను జరుపుకోవాలి:ఎస్సై


సమావేశానికి హాజరైన గణేష్ మండళ్ల నిర్వాహకులు

మోర్తాడ్, ఆగస్టు27: మోర్తాడ్ మండలంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై విక్రం అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్‌మండళ్ల నిర్వాహకులతో గ్రామస్థులతో మాట్లాడారు. గణేష్ మండళ్లను రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేయవద్దని, ప్రజలకు అటంకం కలిగించవద్దని కోరారు.ఈసమావేశంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గణేష్ మండళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఏర్గట్ల ఎస్సై రాము తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్గట్ల పోలీస్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం నుండి రాత్రి వరకు మైక్ సిస్టం, శబ్ద కాలుష్యం లేకుండా జాగ్రత్తలు పాటించాలని, విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని, దాని కోసం పోలీస్ శాఖ వెబ్ సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల విడీసీ సభ్యులు, పలు యూత్‌ల సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: త్వరలో జరుగనున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కమ్మర్‌పల్లి ఇన్‌చార్జ్ ఎస్సై విక్రం సూచించారు.మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవా కమిటి సభ్యులు తప్పనిసరిగా తగు అనుమతులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎస్సై ఇస్మాయల్, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ పోలీస్ సిబ్బంది. ఆయా గ్రామాల గ్రామకమిటీల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గుంతలమయంగా జాతీయ రహదారి

● అడుగడుగున గుంతలు ● అసౌకర్యంగా ప్రయాణం ● భయాందోళనలో వాహనదారులు


మామిడిపల్లి శివారులో రహదారిపై ఏర్పడ్డ గుంత


అంకాపూర్ వద్ద రహదారి ఏర్పడ్డ గుంతలు

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు27: నిజామాబాద్, ఆర్మూర్ పట్టణాల మధ్య 63వ జాతీయరహదారి గుంతల మయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయరహదారిపై పలు చోట్ల తారు లేచి పోయి గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండి భారీ వాహనాలు వెళ్తుండడంతో రోడ్డు తరచు ధ్వంసమవుతుంది. చిన్నాపూర్ శివారులో రోడ్డు గుంతలు పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అంతేగాక మునిపల్లి శివారులో సైతం రోడ్డు చెడిపోయి కంకర తేలడంతో వాహనదారులకు అసౌకర్యంగా మారింది. గుంతలు పడ్డ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో అదమరిస్తే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంకాపూర్, ఆర్మూర్, గ్రామాల మధ్య జాతీయ రహదారి ధ్వంసమై గుంతలు ఏర్పడడంతో వాహనదారులకు ఇబ్బందవులు తప్పడంలేదు. పలు కారణాల వల్ల జాతీయ రహదారి పూర్తి స్థాయిలో నిర్మాణం జరగకపోవడంతో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

● అసంపూర్తిగా రోడ్డు విస్తరణ పనులు

63వ జాతీయరహదారి విస్తరణ పనులు ఇంక అసంపూర్తిగానే ఉండడంతో పూర్తిస్థాయిలో డివైడర్‌ను నిర్మించలేదు. దీంతో కొన్ని చోట్ల వాహనాలు ఎదురెదురుగా వస్తుండడంతో వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. సుమారు పదేళ్ళ క్రితం రూ.108కోట్లతో ప్రారంభించిన రోడ్డు విస్తరణ పనులు పలు చోట్ల అడ్డంకులు ఏర్పడడంతో నిలిచిపోయాయి. అంకాపూర్, ఆర్మూర్ గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులు తమకు నష్టపరిహారం తక్కువ వచ్చిందని కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ పరిధిలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాలేదు. చిన్నాపూర్ శివారులో అటవీ శాఖ వారి క్లీయరెన్స్ రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఈ మార్గంలో నాలుగు చోట్ల డివైడర్‌లు నిర్మించాల్సి ఉంది.

● వాహనదారులకు ఇబ్బందిగా మారిన మామిడిపల్లి గుంతల రోడ్డు

మామిడిపల్లి వద్ద నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి కాకపోవడంతో ఈ ప్రాంతంలో వాహనాలు వెళ్లడానికి సర్వీస్ రోడ్డు ఒక్కటే ఉండడం, అదికూడా ఇరుకుగా ఉండడం వల్ల వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు గత నాలుగేళ్లుగా సాగుతునే ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై అనేక గుంతలు ఏర్పడి బస్సు ప్రయాణం ఊయ్యాలను మరిపిస్తోంది. దీంతో ఈ రోడ్డు వల్ల వాహనదారులకు ప్రయాణం మరింత ఆలస్యమవుతుంది. రైలు వచ్చే సమయంలో గేటు మూసి వేయడంతో వాహనాలు నిలిచిపోయి తిరిగి వెళ్లడానికి మరింత సమయం పడుతుంది. దీంతో నిజామాబాద్, ఆర్మూర్ మధ్య ప్రయాణ సమయం రెట్టింపు అవుతోందని వాహనదారులు వాపోతున్నారు. రైల్వేబ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.. అదే విధంగా జాతీయరహదారికి ఏర్పడిన గుంతలను పూడ్చి వాహనదారులు, ప్రజల ఇబ్బందులు దూరం చేయాలని పలువురు కోరుతున్నారు.

రోడ్లపై గుంతలు పూడ్చాలి



నిజామాబాద్- ఆర్మూర్ రోడ్డుపై ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. దీని వల్ల వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మామిడిపల్లి రైల్వే బ్రిడ్జివద్ద రోడ్డుపై గుంతలు ఎక్కువగా ఏర్పడి వాహనాలు నడపడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోడ్లకు మర మ్మతులు నిర్వహించి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందించాలి.

\- విజయ్, ఆలూర్,గ్రామస్థుడు

పలు చోట్ల ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

బోధన్‌టౌన్,ఆగస్టు27: బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో గల ఇందూర్ ప్రైమరీ స్కూల్‌లో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక వేషధారణ కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ కొడాలి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ కృష్ణాష్టమి ప్రత్యేకతను వివరించారు. ప్రతీ ఒక్కరు కష్టపడే తత్వం, క్రమశిక్షణ అలవర్చుకోవాలని, మంచి ఆలోచనలను అలవర్చుకోవాలని సూచించారు. చిన్నారులచే ఉట్టి కొట్టించి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ బసవేశ్వర్ రావు, న్యాయవాది నరసింహ రెడ్డి, నాగేశ్వర్ రావు, శ్రీనివాస్‌రావు, శ్యామల, ప్రిన్సిపాల్ సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని దూపల్లి గ్రామంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమంలో యువకులు పాల్గొని ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. .ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు లింగన్న యాదవ్, సతీష్, నర్సయ్య, అశోక్, గంగాధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీ వైష్ణవ సాంప్రదాయం ప్రకారం మంగళవారం శ్రీకృష్ణాష్టమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ యొక్క వైభవాన్ని గొప్ప తనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో నవీన్ పంతులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: కృష్ణాష్టమి సందర్భంగా మండల కేంద్రంలోని విడీసి ఆధ్వర్యంలో మంగళవారం ఉట్టి కొట్టే కార్యాక్రమం నిర్వహించారు. ఇందులో పలు యువజన సంఘాల సభ్యులు పాల్గొనగా గ్రామానికి చెందిన శక్తిసేన యూత్ సభ్యులు ఉట్టి కొట్టి నగదు బహుమతిని గెలుపొందారు. ఈ కార్యక్రమంలో విడీసి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోటగిరి: ఉమ్మడి కోటగిరి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొతంగల్ మండలంలోని హంగర్గ ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులు కృష్ణుడి వేషధారణతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. వల్లభాపూర్‌లో ఉట్టి కొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విజయ్ భాస్కర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ, కొండూర్, మైలారం గ్రామలాల్లో కృష్ణాష్టమీ వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. సిరికొండ లో శ్రీలొంకరామలింగేశ్వర ఆలాయంలో ఏడు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో భజనలు చేసి మంగళవారం నాడు గ్రామంలో గోపాల కల్వలు నిర్వహించారు.మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉట్లను కొట్టి కృష్ణాష్టమీ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.

మోపాల్: మండలం నర్సింగ్‌పల్లిలో ఇందూర్ తిరుమలలో చిన్నారులు రాధకృష్ణుడి వేషధారణతో ఆకట్టుకున్నారు.ఈకార్యాక్రమంలో ఆలయ ధర్మకర్తలు గ్రామస్థులుపాల్గొని గోకులాష్టమివేడుకలు ఘనంగా నిర్వహించారు.

మెండోర: మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉట్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామప్రజలు, పాల్గొన్నారు.


రాకాసిపేటలో చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారులు


రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


నర్సింగ్‌పల్లి, దూపల్లిలో ఉట్టి కొడుతున్న యువకులు


హంగర్గ పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

సంతమల్లన్న స్వామికి పూజలు చేసిన ఎస్సై

వేల్పూర్, ఆగస్టు27: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలోని సంతమల్లన్నస్వామి ఆలయంలో మంగళవారం వేల్పూర్ ఎస్సై నాగనాథ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మొదటి సారి సంతమల్లన్న ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంతమల్లన్న ఆలయ చరిత్రను, ప్రతీఏటా జరిగే సంతమల్లన్న జాతర విశిష్ట తను మాలదరణ స్వాములను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై నాగనాథ్‌ను సంత మల్లన్న స్వాములు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంత మల్లన్న స్వాముల పెద్దలు బాలపుణ్యారాజ్,స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

గురుకులలో ఇంటర్ ప్రవేశానికి 29నస్పాట్ కౌన్సిలింగ్

డిచ్‌పల్లి,ఆగస్టు 27: సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశానికి ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ఎంపీసీలో ఎస్సీ-2, బైపీసీ లో ఎస్సీ-1, బీసీ-1 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యా ర్థులు స్పాట్ కౌన్సిలింగ్ కు హాజరు కావాలని ఆమె తెలిపారు.

అధికారులతో సమీక్ష సమావేశం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు27: పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ బస్వారెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని గణేష్ మండపాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ సమా వేశంలో మున్సిపల్ కమిషనర్ రాజు, ఎస్‌హెచ్‌వో రవికుమార్, విద్యుత్ ఏఈ మనిష, సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, అయ్యప్ప శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో బీఆర్ఎస్ సంబరాలు

బోధన్‌రూరల్,ఆగస్టు27: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో బోధన్‌లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ గురువారం రాత్రి 7గంటలకు జైలు నుంచి ఎమ్మెల్సీ కవిత విడుదల అవుతుదన్నారు. సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషికేషన్‌కై ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ రావడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ కవితపై ఎన్ని అక్రమ కేసులు వేసిన కడిగిన ముత్యంలా బయటకు వస్తోందని, గతంలో కేసీఆర్ చెప్పారని ఆయన వివరించారు. ఇన్ని రోజులు జైలులో అధైర్య పడకుండా ధైర్యంగా ఉన్న ఎమ్మెల్సీ కవితకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంజీవ్ కుమార్, సీనియర్ నాయకులు మహ్మద్ రజాక్, నక్క లింగారెడ్డి, పెరిక రామకృష్ణ, రవి శంకర్ గౌడ్, నరేష్ కుమార్, దేవ, ఎన్ఆర్ఐ హైమద్, సాగర్, బోదు శంకర్, రాజు తదితరులున్నారు.

రెంజల్: ఈడీ కేసులో ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు వికార్ పాషా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను లిక్కర్ స్కామ్‌లో జైలుకు పంపడంతో ఎన్ని కేసులు పెట్టి బెదిరించిన కూడా చివరి న్యాయమే గెలిచిందని సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బీఆర్ఎస్ నాయకుల్లో నూతన ఉత్తేజం మొదలైందని, ఎమ్మెల్సీ కవితపై చేసిన ఆరోపణలు నిరాధారణమైనవన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు

భీమ్‌గల్: లిక్కర్ స్కామ్‌లో జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం భీమ్‌గల్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఏ ఆధారాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేసి ఐదు నెలలు జైల్లో ఉంచారని ఇదీ సరికాదని పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ భగత్, మాజీ జడ్పీటీసీ చౌటిపల్లి రవి, నాయకులు నర్సయ్య, లింబాద్రి, ప్రసాద్, అవుసుల నర్సయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో నవీపేట సొసైటీ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, గైని సతీష్, తాహెర్ బిన్ జాఫర్, శ్రీనివాస్, జనార్ధన్, ప్రవీణ్ కుమార్,శ్యామ్,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


భీమ్‌గల్‌లో సంబరాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

డిచ్‌పల్లి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మద్యం కేసులో సుప్రీం కోర్టులో బెయిల్ ఇవ్వడంతో మంగళవారం డిచ్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు కాశీవిశ్వనాథ ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శక్కరి కొండ క్రిష్ణ, నల్లవెల్లి సాయిలు, పద్మరావు,ఒడ్డం నర్సయ్య, నయీమ్, సుదం, గీత,పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడంతో మంగళవారం ఎడపల్లిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మంగల్‌పాడ్ చౌరస్తాలో బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మాజీ ఎంపీపీ కొండెంగల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడం పట్ల ధర్మం గెలిచిందని, అధర్మం ఓడిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేరడి శ్రీరాం, ఎడపల్లి మాజీ ఉప సర్పంచ్‌లు ఆకుల శ్రీనివాస్, లాయక్, మాజీ ఎం పీటీసీలు బాబా, పద్మ ముత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో బీఆర్ఎస్ నాయకులు టపాకాయలుకాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, జీజీ.రాం, మీర శ్రావన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బేసిక్ పేను అమలు చేయాలి


సిరికొండలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లు

సిరికొండ ఆగస్టు 27: మోడల్‌స్కూల్, కేజీబీవీ,ఏఆర్ఎస్ హాస్టల్స్‌లో పనిచేసే నాన్‌టీచింగ్ సిబ్బందికి బేసిక్ పేను అమలు చేయాలని కోరుతూ ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు సిబ్బందిని కోరారు.మంగళవారం సిరికొండలో చలో హైదరాబాద్ ప్రోగ్రాం పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రగతి శీల నాన్‌టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఎస్‌పీడీ కార్యాలయాన్ని ముట్టడికి తరలిరావాలని వారు కోరారు.పదవీ విరమణ బెన్‌ఫిట్‌ను కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఉద్యోగ,ఆరోగ్య భద్రత కల్పించాలని పీఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలను కల్పించాలని సంఘం నాయకులు ప్రశాంతి కోరారు.కార్యక్రమంలో స్వర్ణలత,పద్మా తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్, హాస్టల్ నాన్ టీచింగ్,వర్కర్లకు బేసిక్‌పే అమలు కోసం ఐఎఫ్‌టీయూ, ప్రగతిశీల నాయకుల ఆధ్వర్యంలో ఈనెల 30న చలో ఎస్‌పీడీ ఆఫీస్ పోస్టర్‌లను డిచ్‌పల్లిలో ఆవిష్క రించారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు27: మండలంలోని అంకాపూర్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదుపై బూత్ ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో సైనికులుగా పని చేసి విజయం సాధించడం గర్వంగా ఉందని, అందరు ఏకమై సభ్యత్వాన్ని విజయవంతం చేయాలని, ప్రతీ బూత్‌లో 200మెంబర్ షీప్‌లకు తగ్గకుండా చూడాలని సూచించారు. సెప్టెంబర్ 4నుంచి సభ్యత్వాలు ప్రారంభించాలని, ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్ ద్వారా 8800002024నెంబర్‌కు మిస్‌కాల్ ద్వారా సభ్యత్వం చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీమున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, సభ్యత్వ నమోదు కన్వీనర్ గంగోని సంతోష్, కోకన్వీనర్ జెస్సు అనిల్, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, ద్యాగ ఉదయ్, రోహిత్‌రెడ్డి, రాజు, పొల్కం వేణు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం మండలంలోని హనుమాన్ ఫారంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, సంతోష్, వంశీ మోహన్, శ్రీనివాస గౌడ్, కోరే గంగాధర్, ఆనంద్, గణేష్, రాము, ప్రవీణ్, రాధ, తదితరులున్నారు.

కమ్మర్‌పల్లి: పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయు నిమిత్తం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కట్ట సంజీవ్, ప్రధాన కార్యదర్శి బద్దం రమేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చింత ప్రవీణ్, సంతలింగారెడ్డి, రెంజర్ల గంగాధర్, సోమ నరేష్ మండల నాయకులు కార్యక్తలు పాల్గొన్నారు.

మాక్లూర్: భారతీయ జనతా పార్టీ సంస్థాగత కార్యక్రమంలో భాగంగా ప్రవేశపెట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్‌కుమార్ అన్నా రు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఆర్మూర్ అసెంబ్లీ సభ్యత్వ నమోదు కన్వీనర్ గంగోని సంతోష్, మండల శాఖ అధ్యక్షుడు రమా మాత్ సురేష్‌నాయక్, ప్రవనీరెడ్డి, నర్సాగౌడ్, ఒడ్డెన్న, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన


బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మోస్రా,ఆగస్టు27: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఓటర్ల సవరణ మార్పులు, చేర్పులకై మోస్రా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలకు బీఎల్‌వో మాస్టర్ ట్రైనర్ సాయిలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్ని, చందూర్, మోస్రా మండలాల బీఎల్‌వో మాస్టర్ ట్రైనర్ సాయిలు మాట్లాడుతూ తప్పులు లేకుండా ఓటరు సవరణ ప్రక్రియను చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ మారుతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ప్రభు త్వ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాలలోని ఓటరు జాబితా లో వార్డుల వారిగా ఓటరు జాబితా తయారు చేస్తున్నట్లు ఎంపీఓ మన్ మోహన్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు నాగరాజు గౌడ్, రవి ప్రకాష్ రెడ్డి, ఉదయ భాస్కర్, బిఎల్‌వోలు కంజర్ సుచరిత, బోదు సావిత్రి తదితరులు ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 27: జిల్లాలోని సంక్షేమ వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు మంగళవారం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా గత నాలుగురోజులుగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతిగృహాలు, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో సర్వే నిర్వహించడం జరిగిందని అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. ప్రతీ హాస్టల్‌లో వాటర్ ప్యూరిఫైర్స్‌ను ఏర్పాటుచేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలల్లో పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఉచిత భోజనం ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జిలను పెంచాలని కోరారు. అంతకుముందు నగరంలోని ధర్నాచౌక్‌లో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విఘ్నేష్, జిల్లా అధ్యక్షురాలు దీపిక, దినేష్, రాజు, శ్రావణ్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

'అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి'

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 27: అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర భూమయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ అమలులో కొంతమందికి మాత్రమే 2లక్షలు మాఫీ చేసి మిగిలిన వారికి బ్యాంకులలో టెక్నికల్ ప్రాబ్లమ్ పేరుతో బ్యాంకర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, రాజేశ్వర్, రాజన్న, గంగారాం, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ ఆలయాల్లో గోకులాష్టమి వేడుకలు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు27: శ్రీవైష్ణ ఆలయంలో ఘనంగా గోకులాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో మంగళవారం ఉదయం శ్రీకృష్ణుని విగ్రహానికి అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో శ్రీకృష్ణుడికి అష్టోత్తర శతనామాలతో తులసీ అర్చనలు చేశారు. జిల్లా కేంద్రంలోని జెండాబాలాజీ మందిర్, ఖిల్లా రఘునాథ ఆలయం, చక్రం గుడి, లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయం, ఆర్యనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడాపోటీలు

సుభాష్‌నగర్, ఆగస్టు 27: ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ముత్తెన్న తెలిపారు. 29న ఉదయం 9గంటలకు డీఎస్ఏ మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 28న సాయంత్రం 3గంటలలోపు క్రీడల అధికారి కార్యాలయం సుభాష్‌నగర్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం 9701177144 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యూపీఐ మోసాలకు పాల్పడిన యువకుడి అరెస్ట్

ఖిల్లా, ఆగస్టు27: నగరంలోని 1వ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో యూపీఐ మోసాలకు పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. నగరంలోని పలు మొబైల్ షాప్‌లలో షేక్ అమర్ అనే యువకుడు మొబైల్ ఫోన్లను కొనుగోలుచేసి వాటికి సంబంధించిత డబ్బులను ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఫేక్ యూపీఐ లావాదేవీలు చేసి మోసం చేసినట్లు విచారణలో తేలిందని తెలిపారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.57వేలు ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తి అమర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

యువతిని వేధిస్తున్నాడని పోలీసు కేసు

అవమానభారంతో యువకుడి ఆత్మహత్య

- పోలీసులు కొట్టడం వల్లేనంటూ కుటుంబీకుల ఆరోపణ



సునీల్ (ఫైల్)

నిజామాబాద్‌అర్బన్, ఆగస్టు27: యువతిని వేధిస్తున్నాడని పోలీసులు కేసు నమోదు చేసి విచారించగా.. అవమాన భారంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నగరంలోని కుమార్‌గల్లీకి చెందిన సునీల్(23) అనే యువకుడు జనరల్ స్టోర్ నడుపుతున్నాడు. యువతిని వేధిస్తున్నాడని నగరంలోని మూడవ టౌన్‌లో సునీల్‌పై పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ నిమిత్తం సునీల్‌ను సోమవారం పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపారు. వ్యక్తిగత పూచికత్తుపై స్టేషన్ నుంచి బయటకు వచ్చిన యువకుడు తీవ్ర అవమాన భారంతో మనస్థాపానికి గురై తాను నడుపుతున్న దుకాణంలోనే మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదిలా ఉండగా.. విచారణ నిమిత్తం పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కొట్టడంతో పాటు చిత్రహింసలు చేసినట్లు మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అందువల్లే సునీల్ అవమాన భారంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. ఈ మేరకు నగర ఒకటో టౌన్ పోలీసు స్టేషన్‌లో మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా.. ప్రేమించిన యువతి విషయంలో మనస్థాపానికి గురైనందు వల్లే సునీల్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు నగర ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయబాబు తెలిపారు.

రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



ధర్పల్లిలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ధర్పల్లి, ఆగస్టు27: రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ఆయన 105 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతులకు మూడువిడతల్లో రూ.2లక్షలలోపు రుణాలను మాఫీ చేశామని, రూ.2లక్షలపై ఉన్న రుణాలను త్వరలోనే మాఫీ చేసే ప్రక్రియ ప్రారంభిస్తామని అన్నారు. వివిధ సాంకేతిక కారణాలతో ఇబ్బందులు ఎదురయ్యాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీఇచ్చారు. రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఆయన తిప్పికొట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులను మోసం చేసి ఇప్పుడు రుణమాఫీ కాలేదని రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని, విద్య కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. జీవోనెంబరు 567 ద్వారా మూడువిడతల్లో 41లక్షల మంది రైతులకు రుణవిముక్తి కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, గాదారి మనోహర్‌రెడ్డి, చెలిమెల నర్సయ్య, శ్రీనివాస్, కృష్ణ, వైజీఆర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ మాఫీ చేస్తాం..

సిరికొండ: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రైతులకు భరోసా కల్పించారు. సిరికొండ మండలం పెద్దవాల్గోట్‌లో రూ.23లక్షలతో, కొండూర్‌లో రూ.21లక్షలతో నిర్మించిన గోడౌన్‌లను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ప్రారంభించారు. సిరికొండ, కొండూర్‌లో జరిగిన సమావేశాల్లో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ రైతుల ఇళ్ల వద్దకే వ్యవసాయ అధికారులు వచ్చి మాఫీ కాని రైతులకు రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వానికి నివేదికను పంపిస్తారని అన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ఆందోళన చెందవద్దని కోరారు. మోడల్ స్కూల్‌కు రోడ్డు నిర్మాణానికి, పాఠశాలకు ప్రహరీ, టాయిలెట్స్ కోసం నిధులు మంజూరుకు ఎమ్మెల్యే హామీఇచ్చారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ అధ్యక్షులు తారచంద్ నాయక్, పీఏసీఎస్ అధ్యక్షుడు చెల్లం గంగాధర్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో తారచంద్ కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు రవి, జిల్లా నాయకులు తదితరులున్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ జేఏసీ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

సుభాష్‌నగర్, ఆగస్టు 27: ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నగరంలోని బస్టాండ్ ఎదుట నల్లబ్యాడ్జీలు పెట్టుకొని జేఏసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జేఏసీ నాయకులు వందేమాతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టీసీలో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పీఆర్‌సీ బాండ్ డబ్బులను చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్‌లకు అనుమతించాలన్నారు. కార్యక్రమంలో లింబాద్రి, అబ్బయ్య, జేడీ రెడ్డి, జీఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

29న ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 27: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 29న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటీవ్, రిలేషన్‌షిప్ మేనేజర్, సూపర్‌వైజర్, అడ్వైజర్ పోస్టులకు ఉద్యోగాలు కలవని డిప్లొమా, ఐటిఐ, డిగ్రీ పాసైన పురుష, మహిళా అభ్యర్థులు జాబ్‌మేళాలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నిజామాబాద్, ఆర్మూర్‌లలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అభ్యర్థులు 29న ఉదయం 10.30లకు తమ రెజ్యూమ్, బయోడెటా, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఫొటోతో నగరంలోని శివాజీనగర్‌లోగల జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9581 768413, 9948748428 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్

సుభాష్‌నగర్, ఆగస్టు 27: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ ప్రజలను కోరారు. నగరంలోని 19వ డివిజన్‌లో మంగళవారం కమిషనర్ మంద మకరంద్ పర్యటించారు. శుక్రవారంతోపాటు మంగళవారం కూడా డ్రైడే ఫ్రైడేగా పాటించడం జరుగుతుందన్నారు. నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో డెంగ్యూవచ్చి తగ్గిన వ్యక్తులు తమ ఇంటి పరిసరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ నివారణ కోసం ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన కమిషనర్

నగర శివారులోగల డంపింగ్ యార్డును నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్ పరిశీలించారు. మంగళవారం ఉదయం డంపింగ్ యార్డులోని పరిసరాలను పరిశీలించారు. అక్కడ ఉన్న రికార్డులను, హాజరుపట్టికను పరిశీలించారు. డంపింగ్ నిర్వహణ విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, జవాన్, తదితరులు ఉన్నారు.

'పార్టీని వీడినవారు స్వచ్ఛందంగా టీడీపీలోకి తిరిగిరావాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 27: పార్టీ వీడిన నాయకులు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీలోకి రావాలని నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేగాం యాదాగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా కోరారు. చంద్రబాబు ఆదేశాల మేరకు సభ్యత్వాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా సభ్యత్వాలు జరుగుతాయని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రతీ ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని కోరారు.

బాధితురాలికి ఆర్థిక సహాయం

ఖిల్లా, ఆగస్టు27: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన నిరుపేద మహిళకు తహపుజే ఖత్మే నబువత్ ఎడ్యుకేషన్ చారిటబుల్‌ట్రస్ట్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో బాధిత మహిళకు రూ.10వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోవడంతో ఆమె కుటుంబం వీధిన పడిన విషయాన్ని తెలుసుకున్న ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం ఆమెకు తమ వంతు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు.

ప్రజ్ఞా వికాస్‌లో ధర్పల్లి విద్యార్థుల ప్రతిభ

ధర్పల్లి, ఆగస్టు 27: త్రిదండి చిన్నజియర్ స్వామి ఆధ్వర్యంలో జరిగే ప్రజ్ఞా వికాస్ కార్యక్రమంలో మండల కేంద్రానికి చెందిన లిటిల్ హార్ట్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జిల్లాస్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీలో 10వ తరగతి విద్యార్థి అనన్య ప్రథమ బహుమతి సాధించింది. వర్షిని కన్సోలేషన్ బహుమతి గెలుచుకుందని పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయురాలు సాధనలు తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని అభినందించారు. సెప్టెంబర్ 2న ముచ్చింతల్‌లో జరిగే కార్యక్రమంలో చిన్నజియర్ చేతుల మీదుగా బహుమతులను అందుకుంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలో సైతం విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

సిబ్బంది విధి నిర్వహణలో

అలసత్వం వహించొద్దు

ఖిల్లా, ఆగస్టు 27: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని ఐఎస్‌డబ్ల్యూ హైదరాబాద్ అధికారులు పోలీసు అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీ ఆదేశాల మేరకు, పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ సింగనేవార్ సూచనల మేరకు ఐఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో ఇన్స్పెక్షన్ కార్యక్రమాన్ని డీఎస్‌పీ ఆర్.నాగేశ్వర్‌రావ్, వారి బృందం పీఎస్.ఓలు, బీడీటీమ్, డ్యాగ్‌స్క్వాడ్, ఎంటి విభాగాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. సిబ్బంది విధుల నిర్వహణ, సిబ్బంది ఫిజికల్ ఫిట్నెస్ గురించి, అన్ని రకాల పరికరాల ఉపయోగం, మెయింటెన్స్, డాగ్ స్క్వాడ్ విధులు, బీఆర్.వాహనం మెయింటెన్స్ అంశాలపై వివరించారు. ఈ అంశాలను విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని తెలిపారు. సిబ్బందికి ఎలాంటి సందేహాలు ఉన్నా తమపై అధికారి, ఉన్నతాధికారికి ఎప్పటికప్పుడు తెలియచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏఆర్) డి.శంకర్‌నాయక్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్స్ హెచ్.సతీష్, ఎమ్‌టిఓ తిరుపతి, ఆర్ఎస్ఐ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యూజీసీ నెట్ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 27: యూజీసీ -నెట్ ఫేస్-2 పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 4 వరకు జరుగనున్న పరీక్షలు నగరంలోని బోధన్ రోడ్‌లోగల నాలెడ్జ్‌పార్క్ పరీక్ష కేంద్రంలో నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో రెండు షిఫ్టలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు అబ్జర్‌వర్‌గా తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ను నియమించామని పరీక్షలు సజావుగా జరపడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా నేషనల్ టెస్ట్ ఏజెన్సీ కోఆర్డినేటర్ భాస్కర్ మెరిగ తెలిపారు. జూన్ 18న ఆఫ్‌లైన్ పద్ధతిలో జరిగిన యూజీసీ నెట్ పరీక్ష రద్దు కాగా ఇప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలపై ఎలాంటి సందేహాలు ఉన్నా 8978198421 నెంబర్‌ను సంప్రదించాలని భాస్కర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇందల్వాయి, ఆగస్టు27: ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిచ్‌పల్లి ఏడీఈ జి.శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 33 కెవి ఫీడర్ సిర్నాపల్లి పరిధిలో నల్లవెల్లి, మేగ్యానాయక్ తాండా, డొంకల్, కొటాల్‌పల్లి గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఇందల్వాయి టిజిఎన్‌పిడిసిఎల్ ఏఈ పండరినాథ్, ఎల్లారెడ్డిపల్లి ఏఈ జ్ఞానేశ్వర్‌లు తెలిపారు.

మట్కా స్థావరంపై దాడి.. ముగ్గురి అరెస్టు

ఖిల్లా, ఆగస్టు 27: నగరంలోని 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా స్థావరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.29,690, 3 ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. నగరంలోని మిర్చికంపౌండ్‌లో ఆన్‌లైన్ మట్కా ఆడుతున్నట్లు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ మట్కా నిర్వహిస్తున్న మహ్మద్ ముజాహిద్, షేక్ హమీద్, షేక్ నాజర్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఇందల్వాయి, ఆగస్టు27: గన్నారంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. గన్నారానికి చెందిన వేల్పూర్ సాయన్న (60) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. మృతుడి భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,500	రూ.68,700	రూ.905

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1	: స్త్రీ-2 (హిందీ) (10.00, 4.30, 10.50)
	: కమిటీ కుర్రాళ్లు (1.15)
	: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.45)
స్క్రీన్-2	: ఏలియన్ రొమ్ములస్ (10.15)
	: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (1.00)
	: తంగాలన్ (4.05), స్త్రీ-2 (హిందీ) (7.25)
	: మారుతినగర్ సుబ్రమణ్యం (10.40)
స్క్రీన్-3	: డిమోంటి కాలనీ-2 (10.20, 4.40, 10.30)
	: స్త్రీ-2 (హిందీ) (1.25)
	: ఏలియన్ రొమ్ములస్ (ఇంగ్లీష్) (7.45)
స్క్రీన్-4	: మారుతినగర్ సుబ్రమణ్యం (10.00)
	: తంగాలన్ (1.10)
	: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (4.30)
	: కమిటీ కుర్రాళ్లు (7.35)
	: ఇంద్ర (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1	: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (10.20, 4.20, 10.20)
	: తంగలాన్ (1.20, 7.20)
స్క్రీన్-2	: డిమోంటి కాలనీ-2 (10.25, 10.20)
	: స్త్రీ-2 (హిందీ) (1.30)
	: కమిటీ కుర్రాళ్లు (4.30)
	: అయ్ మేం ఫ్రెండ్స్ అండి (7.30)
స్క్రీన్-3	: స్త్రీ-2 (హిందీ) (10.20, 10.20)
	: మారుతినగర్ సుబ్రమణ్యం (1.20)
	: డిమోంటి కాలనీ-2 (4.20)
	: డబుల్ ఇస్మార్ట్ (7.10)

దేవి	: తంగలాన్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: కమిటీ కుర్రాళ్లు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: మిస్టర్ బచ్చన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: డబుల్ ఇస్మార్ట్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్